పరిశోధకులు

విశ్వనాథ సత్యనారాయణగారు

కొన్ని ఏండ్లక్రింద చెన్నరాజధానిలో హైస్కూళ్లల్లో నాండీటైల్డు టెక్స్టని (Nondetailed text) నాలుగైదు ఫారాలకి రాజస్థానకథలు కొన్ని పెట్టేవాళ్లు యింగ్లీషులో. ఈ యింగ్లీషుస్కూళ్లల్లో తెలుగు చెప్పే మేష్టర్లకన్న తక్కిన సబ్జెక్ట్లు చెప్పే మేష్టర్లూ, వాళ్లకన్న యింగ్లీషుచెప్పే మేష్టర్లూ ఎక్కువని అందరికినీ తెలుసునుకదా. ఆయింగ్లీషు చెప్పే మేష్టర్లని చూస్తే పిల్లలకి హడలు. పరీక్షలో తప్పించటమో, ప్యాసు చేయడమో వాళ్ల చేతుల్లో ఉండేది. పైగా యింగ్లీషు చెప్పే మేష్టరంటే పెద్దపండితుడనీ, వాడి నోటివెంబడి ఏదైనా వస్తే వేదాల్లో ముక్కైనా తప్పుతుంది గాని అది కాదని.

ఒకపల్లెటూరులో అక్కడ ఉన్న పెద్ద రైతు లందరూ కలసి వాళ్లు చాలా డబ్బు కల వాళ్లు కావటంవల్ల క్రమక్రమంగా ఎలిమెంటరీస్కూలల్లా హైస్కూలు చేయించారు. చెయ్యటంతోటే బస్తీ తయారు, దిగాలబడ్డ మొగాల్తో యింటికెళ్లే మేష్టర్లు తయారు, పిల్లల అల్లర్లు తయారు. చదువు ఎక్కడికక్కడికి మట్టం అయిపోయేది.

కాని, యింగ్లీషు చదువటంతోటే, మన దేశం ఎట్లా వున్నా సరే ఇంగ్లాండుదేశం ఎట్లా వుందో దాన్నిగురించి హోరాహోరీ కుస్తీలు. మనభాష ఎట్లా వున్నా సరే, ఇంగ్లీషు బాగా వచ్చునా లేదా విద్యార్థులకు, దాన్నిగురించి తగాదా. ఒక చక్కని చంద్రమొద్దు, వాడి ఖర్మంచాలక బాగా యింగ్లీషు వ్రాశాడా వాడు చాలా తెలివిగలవాడు. తెలుగులో ఎంత తెలివిగలవాడైనా యింగ్లీషులో మార్కులు సరిగ్గా రాకపోతే తప్పించటమే.

ఆప్పాళ్లో ౫వ ఫారానికి యీ రాజస్థాన కథలు టెక్స్టు—అనగా పాఠ్యపుస్తకం. ౫వ ఫారంలో మూడుడివిజన్లు. రెండుడివిజన్లకు జి. రామచంద్రరావుగారు యింగ్లీషు చెపుతాడు. ఒక డివిజన్కి యమ్. సీతారామయ్యగారు చెప్తారు. ఇద్దరూ బి. యే., యల్. టీ. లే. అమోఘమైన తెలివితేటలు గలవాళ్లు. అనగా బి. యే., యల్. టీ. లందరూ ఎంత తెలివిగల వాళ్లో అంత తెలివిగలవాళ్లు.

ఈకథ యిట్లా ఉండగా, ఆరెండుడివిజన్ల వారికి రామచంద్రరావుగారంటే లార్డుక్లైవు (Lord Clive), వెలస్లీ ప్రభువు (Wellesly). ఆయన్ని మించినవాళ్లు సృష్టిలో ఉండరు. మిగిలిన డివిజన్ల వారికి సీతారామయ్యగారన్నా అంతే.

ఇంక, వాళ్లిద్దరికీ, ఒకళ్లను చూస్తే ఒకళ్లకి జలుబులు. రామచంద్రయ్యకన్న సీతారామయ్య తనకు బాగా యింగ్లీషు వచ్చుననీ, అసలు తన యింగ్లీషు Bernard Shaw కి

ఘాటో అని. యదార్థానికి Shaw పుస్తకం ఒక్కటైనా ఆ ప్రభువు చదివిన పాపాన పోలేదు. రామచంద్రయ్య గారి ఉద్దేశ్యం మెకాలే (Macaulay) చచ్చి తనుగా పుట్టేననీ. వాళ్లిద్దరూ యింగ్లీషులో యమాహేమీలు. సీతారామయ్యగారు Classical English గుత్తగొన్నాడనీ, రామచంద్రయ్యగారు Modern English గుత్తగొన్నాడనీ—ఇద్దరూ కలిసి ఛాసర్ (Chaucer)దగ్గరనుంచి యింతవరకూ. 'వాడుట్టి Pedant, వాడి కేమొచ్చు యింగ్లీషు?' అని సీతారామయ్యమీద తోల్తాడు రామచంద్రయ్య. 'ఈ వెధవకి Is, Was ఎక్కడ వెయ్యాలో తెలియదు' అని రామచంద్రయ్యమీద సవారీ తీస్తాడు సీతారామయ్య. ఇదంతా క్లాసులో పిల్లలముందు. మళ్లీ, యిద్దరూ కలుసుకుంటారా, 'ఏమండీ రామచంద్రయ్యగా' రంటే 'ఏమండీ సీతారామయ్యగారూ?' ఇద్దరికీ చెరో పన్నెండేళ్ల కొడుకులూ. ఇద్దరూ ఫస్టుఫారం చదువుతున్నారు. సహాధ్యాయు౹౹. వీళ్లిద్దరి భార్యలూ యింటివద్ద స్నేహితురాండ్రు. కనక వీళ్ల విరోధం యింగ్లీషుతోనే ఆగిపోయింది, తెలుగుదాకా పట్టలా. స్కూలుతోనే ఆగిపోయింది, యింటిదాకా పాకలా.

ఇంతకూ ఏతావాతా కథ ఏవిటంటే: నాండిబైబులో Punna అని ఒక మనిషి వస్తుంది. ఆపేరు ఒక ఆవెడిది. ఆవిడ రాజపుత్ర స్త్రీ. ఆపదలో ఉండి ఆవిడ తన చేతి రుమాలు ఒక రాజపుత్రుడికి బహుమానం బంపింది. ఆచేతి రుమాలు ఎవరికి పంపితే వాళ్లొచ్చి ఆవిణ్ణి ఆపదలోంచి రక్షించాల్ట. అది వాళ్ల ఆచారం. అసలు కథ అది.

అసలు కథకూ మనకూ ఏమీ సంబంధం లేదు. ఆవిడపేరు సీతారామయ్య 'పన్నా' అని చెప్పాడు. రామచంద్రయ్య 'పున్నా' అని చెప్పేడు. ఒక పదిరోజు లైనతర్వాత సీతారామయ్యడివిజన్‌లో ఒకడు రామచంద్రయ్యడివిజన్ వాడితో మాట్లాడుతూ 'పన్నా' అన్నాడు. అక్కడ రామచంద్రయ్య డివిజన్‌వాళ్లు ఐదార్గురు ఉండి, వాళ్లందరూ కలిసి వీణ్ణి ఏడిపించారు, 'పన్నా ఏవిట్రా double పన్నా, single పన్నా' అని. అది సరిపోయిందా, ఆకుఱ్ఱాడెక్కడ కనపడ్డా సరే, రామచంద్రయ్య డివిజన్‌వాళ్లు సింగిల్ పన్నా, డబుల్ పన్నా అని కేక లెయ్యటం మొదలెట్టారు. వాడికీ ఒళ్లు మండింది. వాళ్ల డివిజన్‌వాళ్లని పదిమందిని పోగుచేసి యాగీచేసేడు. అవతలవాళ్లని ఏడిపించటం ఎట్లాగా అని వాళ్లందరూ గూడుపుఠాణీ చేసారు. వాళ్ల అదృష్టంకొద్దీ వాళ్లహైస్కూలుబంట్రోతుపేరు పున్నయ్య. ఇంక రామచంద్రయ్యడివిజన్‌వాళ్లు ఎక్కడ కనపడ్డా సరే, 'బంట్రోతు పున్నాయి, బంట్రోతు పున్నాయి ......' అని వీళ్లు కేక లెయ్యటం మొదలెట్టారు.

ఆవేశాలు బాగా పెరిగినై.

క్రమంగా దెబ్బలాటల్లోకి దిగింది. అవతలడివిజన్ వాళ్లు కనపడితే ఫౌన్ టెన్ పెన్ సిరా అంతా వాడి వీపుమీాద map వెయ్యటం. Swan ink bottles ఆగలా. ఒక్కొక్కప్పుడు ముక్కులమీాద గుద్దుకోటం. బక్కముండాకొడుకుల్ని రెక్కపుష్టి గలవాళ్లు దొంగగుద్దులు గుద్దటం. హెడ్మాస్టరికి రిపోర్టులు వెళ్లినై. ఆయన కొందరికి ఫైన్లు వేశాడు. కొందరికి ప్రహారణాల్తో సరిపోయింది. అంతటితో కుఱ్ఱాళ్లల్లో సద్దుమణిగింది.

కాని అది 'పన్నా?' 'పున్నా?' రామచంద్రయ్య సీతారామయ్యలకు తేల్లా. సీతారామయ్య ఓపికకల మనిషి. అది 'పన్నా' అని నిర్ధారణచేద్దా మనుకున్నాడు. ఆలోచించాడు. Todd's రాజస్థానం అంతా తిరగేశాడు. ఒకసారి బెజవాడ వెళ్లితే గెజట్లూ గిజట్లూ తిరగేశాడు. లైబ్రరీలు గాలించేడు. ఎక్కడా ఆసరా చిక్కలా.

ఒకరోజున వాళ్ల అబ్బాయి తెలుగు టెక్స్టు చదువుకుంటున్నాడు. అందులోయిల్లా చదివేడు కుఱ్ఱాడు: 'శిశిరఋతువు వచ్చెను. వృక్షముల పర్ణములు రాలెను' అని. సీతారామయ్య యీ వాక్యం విన్నాడు. కుర్చీలోంచి ఎగిరి గంతేశాడు. 'చిక్కిందిరా పట్టు' అన్నాడు. ఇంతలో వంటచేస్తున్న ఆయన పెళ్లాం గాబరాపడి బైటికి వచ్చింది. 'ఏమిటేమిటి' అంది. ఏమిటీ లేదు, గీమిటీ లేదు, సీతారామయ్య ఎగురుతున్నాడు. ఆవిడ మడికట్టుకోనిఉంది పాపం. 'ఏమిటి చెప్పండి. తేలూ గీలూ ఏమైనా కుట్టిందా ఖర్మం' అంది. ఆయన 'తేలూ లేదు, ఏమి లేదు. పర్ణ శబ్దంలోంచి పన్న అన్నశబ్దం పుట్టిం' దన్నాడు. ఆవిడ కొంచెం గడుసగుల యింటి పిల్ల. 'ఆఁ అల్లాగుటండీ!' అని నోటిమీాద చెయ్యి వేసుకోని ఒకవిధమైన వెక్కిరింపునవ్వుతో లోపలికి పోయింది. మొహం చూస్తే 'భలే మొగుడ్రా!' అనుకున్నట్టుంది.

సరే యింకా ఏం. ఈపరిశోధన పిల్లలకు చెప్పి సవాలు విసిరేడు సీతారామయ్య. రామచంద్రయ్య కొంచెం మట్టిబుఱ్ఱ. అతగాడికి ఏమీా తోచింవికాదు సాధనం. ఒక నెలైంతర్వాత పున్నా శబ్దం మాత్రం ఏ సంస్కృత శబ్దంలోంచో పుట్టి ఉండకూడదా అనిపించింది. ఎందులోంచి వచ్చివుండవచ్చునో మాత్రం తోచింది గాదు. గాభరా పడుతూన్నాడు. పదిహేను రోజుల కోసారి కొత్త సవాలు వస్తూనేవుంది. చస్తాడూ?

రామచంద్రయ్యకి బృహస్పతి మంచి గడికి తిరిగేడు. వాళ్ల బావమరిది తెలుగు, సంస్కృతం చదువుకున్న గడుసుపిండం. వాడికి యింగ్లీషు రాదు. రామచంద్రయ్య తను యింగ్లీషు చదువుకున్నానని నిక్కిపోతాడు. ఇంగ్లీషు చదువుకున్న వాళ్లు సర్వసూన్యంగాళ్లని వాడు లుస్కరిస్తాడు. ఆరోజున వీళ్ల యింటికి ఆయన చక్కావచ్చేడు. భోయనంవేళ్ల తాను B.A., L.T. ప్యాసైన దర్జా సహం చంపుకోని,

యీకథ బావమరిదితో వెళ్లపెట్టాడు. వాడు వెధవపెంకె. 'బావా, నీబుద్ధి పూర్ణానుస్వారం' అన్నాడు. రామచంద్రయ్యకి అర్థం కావడానికి అనుస్వారం అడ్డువచ్చింది. ఏమైపునా కైవారమే వత్తుకుంటోంది. మరి కాసేపు ఏడిపించి, బావమరిది "'పూర్ణ' శబ్దంలోంచి 'పున్న' వచ్చివుండవచ్చు" అన్నాడు. ఇంకా నేం, రామచంద్రయ్యకు చల్లా అన్నం సయించలా. కాని స్కూల్లో యింగ్లీషు పీరియడు నాల్గోపీరియడు గాని తగలడి చావలేదు. అందాకా వెధవనారదుడుమల్లే గుక్కపెట్టుకోని క్లాసులోకి వెళ్లటంతోటే ఊదేడు. వారంరోజుల్లో పున్న అన్నశబ్దం పూర్ణశబ్దభవమా పర్ణశబ్దభవమా తేలింది గాదు. ఎవరికొమ్ములు వాళ్లు కాశారు. ఈ వ్యవహారం తేలింది కాదు. క్రిష్టమస్ శలవలు వచ్చినై.

మెడ్రాసు పోయి, పెద్ద పరిశోధనాపండితులు (Research scholars) ఉంటారు, వాళ్లను పోయి యీవిషయం కనుక్కుంటే గాని తేలదనుకున్నారు యిద్దరు. ఇద్దరికీ బైటకు స్నేహమేగా! మెడ్రాసులో మూర్ మార్కెటు (Moore Market) చూడచ్చు. బీచ్ (Beach) ఒడ్డున కొంచెం షికారు కొట్టచ్చు. (Elphinstone) ఎల్‌ఫిన్‌స్టన్ అలంకరించచ్చు. కావలిస్తే గిండీ (Guindy) లో చిలుం వదుల్చుకోచ్చు. ప్రధానంగా పెద్దపరిశోధనా విషయం తేల్తుంది.

ఇద్దరూ కలసి ప్రయాణం కట్టారు. మర్నాడు బయల్దేరారు. బయల్దేరి వాకిట్లోకొచ్చారు, తాంబూలం నముల్తూ. ఆవూళ్లో ఓ పిచ్చి మంది. 'ఈవూరు కొత్తగా వచ్చిన మేష్టర్లు చచ్చారోయి' అని కేకవేస్తూ ఎదురుగా వచ్చింది. 'ఛీ, వెధవశకునం' అని ఆరోజుకి ప్రయాణం ఉపసంహరించుకున్నారు. ప్రభువులు, చాదస్తానికి నిధులు. మర్నాడు మళ్లీ సావకాశంగా భోయనం చేసి, అటూ, యిటూ ఎవ్వరూ లేరనిపించుకోని బయల్దేరారు. ఇంతలో గోడ్డు చస్తే రాంబందు తయ్యారయినట్టు ఒక వెధవముండ తయారైంది. ఛూ, ఛూ, అనుకోని, ఆనాడు ప్రయాణం మానేశారు. మళ్లీ మర్నాడు బయల్దేరేరు. ఆరోజున తమ యిద్దరు కొడుకులూ ఎదురుగా వచ్చేరు. ఉపనయనం కాకపోయినా యిద్దరినీ బ్రాహ్మల కింద లెక్కించి, శకునం బనాయించి, బయల్దేరి బెజవాడ వెళ్లేరు. బెజవాడలో కొంతసేపు కాలక్షేపంచేసి మెయిలు పట్టారు పట్నంకి. బేశిన్ బ్రిడ్జిదగ్గిరికి వెళ్లేటప్పటికీ యిద్దరికీ సహాధ్యాయి ఒకడు కనపడ్డాడు. వాడు పరమ అల్లరివాడు. వాడూ యల్.టీ. ప్యాసయినాడు. 'ఏరా, ఉద్యోగం ఎందుకురా' అంటే 'ఏదో పొట్టకురా' అంటాడుగాని, తానొకపెద్ద మహాకార్యం చేస్తున్నానని, విజ్ఞానం వెదచల్లుతున్నానని అనుకోడు, అనడు. అతడికి వెఱ్ఱిపుచ్చకాయిముండాకొడుకుల్ని పట్టించడం పని. అంచేత వాణ్ణి చూడ్డంతోటే మన పరిశోధకులిద్దరికీ మొహం మాడింది. వాడు వదిలి

పెడతాడూ? పలకరించాడు. వాడూ ఏదో position లో ఉన్నాడు, status కలవాడుకదా అని మాట్లాడేరు. పట్నంలో దిగి ఓబండిలో కూర్చున్నారు. 'ఎందుకురాపట్నంవస్తున్నారు' అని అడిగేడు వాడు. రామచంద్రయ్య పూస గుచ్చినట్టు చెప్పేడు అంతా. చెప్పి, మెడ్రాసు బయలుదేరటం, మొదటిరోజున పిచ్చిది ఎదురుగా రావటం, రెండవరోజున ముండ ఎదురుగా రావటం, మూడోరోజున కొడుకులు ఎదురుగా రావటం, చెప్పి, చివరకు, ఎట్లాగైనా పట్నం వచ్చామయ్యా అన్నాడు. 'వచ్చి ఏమి లాభం, పని యింటి దగ్గిరే అయింది' అన్నాడు స్నేహితుడు. సీతారామయ్య తెల్ల పోయి చూశాడు. 'ఇంటిదగ్గిర ఏమైం'దన్నాడు. 'మీ పరిశోధనలకు సమాధానం యింటి దగ్గిరే వచ్చింది గదా' అన్నాడు. మళ్లీ యిద్దరూ గాభరా పడిపోయారు.

స్నేహితుడు—అయ్యో, తెలివి; మొదటి రోజున పిచ్చి, రెండోరోజున ముండ, మూడో రోజున కొడుకులూ—'పిచ్చి...ముండా... కొడుకులు' అని యింటిదగ్గిరే వస్తే, ఎందుకురా?

వాళ్లిద్దరికీ వాణ్ణి మింగుదా మనిపించిది. —కాని వాడే మింగగలు.

శ్రీ లక్ష్మీనృసింహస్వామి ఆలయ మహాద్వారము, కదిరి

ఛాయాచిత్రకారుడు: బి. యస్. రాయుడు, మదనపల్లె.